'రాగమయి'

శ్రీ విజయ – రాఘవ

(గతసంచిక తరువాయి)

పాలకోసం చంటిబిడ్డ చనిపోయిన తల్లి రొమ్ము చీకుతూన్న దృశ్యం, క్రొత్తగా పెళ్ళయ్యి ప్రయాణం చేస్తున్న దంపతుల శవాలు, యిలాంటివన్నీ కళ్ళల్లోకి దొంతర దొంతరగా తరలి వస్తున్నాయి. బరువుగల యినుప స్తంభానికి, కొయ్యబల్లకి మధ్య యిరుక్కుపోయి, తప్పించమని కుటుంబరావును సహాయం కోరుతున్న కామేశ్వరరావు కేకలు సుందరమ్మను కలవరపరిచాయి. బావకు సహాయం చేసే నిమిత్తంగా కుటుంబరావు ఆ కేకవిని తర్వాత రైల్లో బయలుదేరి వస్తున్నట్లు, ఆ రైలు శరవేగంతో పట్టాల మీద కాకుండా పోతున్నట్లు, "పడిపోతావేమోరా! అన్నయ్యా" అని తాను మందలిస్తున్నట్లు, చివరకు ఆ రైలు కనిపించకుండాపోయి, ఒక చీకటి గుహలోకి దూరినట్లు, కుటుంబరావు ఆ వేగానికి తట్టుకోలేక, పట్టుకొన్న ఆధారాన్ని నొదిలివేసి, అనంతమైన అఘాతంలోకి చొచ్చుకొనిపోయినట్లు" కలవరించింది. చివాలున లేచి కూర్చుంది. కుటుంబరావు దగ్గు తెరలవల్లోపడకుండా నిశ్శబ్దంగా పడుకొని వున్నాడు. గూట్లో వెలుగుతున్న కిరసనాయిలు దీపం ఆరిపోయేటప్పటికి సుందరమ్మకు బాగా తెలివి వచ్చింది. కళ్లు నులుము కొని తేరిపారచూసింది. ఇంతలో రెండువీధి కుక్కలు జోరుగా మొరుగుతున్నయి. అపశకున సూచకంగా మరికొన్ని కుక్కలు కుయ్యోమంటూ రాగాలాపన చేస్తున్నయి. సుందరమ్మ తలపైపున వున్న మర చెంబులోంచి ఒక గ్లాసుడు మంచినీళ్లు త్రాగింది. చీకట్లో గ్లాసు నేలమీద పెట్టినట్లు శబ్దం అయింది. గదిలోంచి రాగమయి "అమ్మా!" అంది. "ఆ... నేనే లే...!" అంది సుందరమ్మ. వీధి తలుపు తట్టినట్లు యింతలో వినిపించింది. సుందరమ్మ మనస్సులో రకరకాలైన ఆలోచనలు కలిగినట్లు ధ్వనించింది.

"అత్తయ్యా!" అని యీ సారి కేక వినిపించింది. సుందరమ్మ ఆ గొంతు గుర్తుపట్టి వెళ్ళి తలుపుతీసింది. మబ్బు పట్టిన ఆకాశంమీద మనుష్యులెవరో నల్లగా కనిపించి, తనవంక చూస్తూ వెకిలిగా నవ్వినట్లు, తాను ఆ నవ్వుచూసి భయపడినట్లు సుందరమ్మకు భ్రమ కలిగింది. తీతువు— "నా విధి కూస్తూ వెళ్ళడమేగా" అన్నట్లు రెక్కలాడించు కొంటూ, ఆ నల్లని మనుష్యుల పాదాల సమీపంలోంచి వెళ్ళిపోతూండటం కనిపించింది.

"రఘూ! యేమిటింత పొద్దుపోయి రావటం?" అంది సుందరమ్మ.

"కారందలేదు నడిచి వచ్చాను!" అన్నాడు రఘునాథం.

"ఇంత చీకట్లో నడిచి రాకపోతే జట్కా చేయించుకొని రాకపోయావా" అంది సుందరమ్మ.

ఇంతలో రాగమయి సింహద్వారం తలుపు తెరచుకొని బయటికివచ్చి నిల్చుంది.

"రఘూ! నీళ్ళున్నయి స్నానం చేద్దుగాని, రా!" అంది సుందరమ్మ.

"ఆ... యిప్పుడెందుకు లెద్దూ! చాల పొద్దుపోయింది"—అన్నాడు.

"ఈలోపుగా అన్నం పెడుతుంటాను బావా!" అంది రాగమయి.

"స్నానంచేయ బుద్ధికావడంలేదుగానీ, కాస్తన్నం పెడుదూ పాపా!" అన్నాడు రఘునాథం.

రాగమయిని "పాపా" అని పిలవడం రఘునాథానికి ముచ్చటగా వుంటుందని సుందరమ్మకు తెలుసు. ఇదివరలో రఘునాథమే యీ విషయం ముఖాముఖిగా అన్నాడు కూడా. అప్పుడు సుందరమ్మ నవ్వుతూ— "నీ యిష్టమొచ్చినట్లు పిలూ. ఎలా పిలిస్తేమాత్రం అది పలకదూ! నువ్వేమన్నా దానికిష్టమే!" అంది సుందరమ్మ. రాగమయికి యెందుకో బావ, 'పాపా'

అన్నప్పుడల్లా లేడి పిల్లలాగా బెదురుతూ చూస్తుండేది. 'పాపా' అన్నప్పుడు "తనింకా చంటి పాపాయినేమో! బావ దృష్టిలో" అని అనుకొంటూండేది. శ్యామసుందరికి "బాగా నేవుంది నీ పేరు" అని రాగమయిని, "ఏరి కోరి పెట్టుకొన్నావ్" అని రఘునాధాన్ని మెచ్చుకొంది. ఇదంతా జరిగింది వాళ్ళ వాళ్ళ సంసారాలు సుఖంగా గడుస్తున్న రోజుల్లో.

రాగమయి కాళ్లు చేతులు కడుక్కొంటానికి వేన్నీళ్లు యిత్తడి చెంబుతో తెచ్చి—"కాళ్లు చేతులు కడుక్కో బావా!" అంటూ అందించింది,

రఘునాథం కడుక్కొంటుండగా రాగమయి లాంతరు పెద్దచేసి కంచంలో అన్నం వడ్డించింది. సుందరమ్మ వెంట రఘునాథం లోపలికివచ్చి అన్నం ముందు కూర్చున్నాడు. రాగమయి వడ్డిస్తోంది. సుందరమ్మ యెదురుగా గోడకానుకొని జారగిలబడి కూర్చొంది.

"నాన్నేనా! వాకిల్లో పడుకొంది?" అని అడిగాడు రఘునాథం.

"ఊ...నాన్నే"... అంది సుందరమ్మ.

"యివ్వాళ పెందలాడే వచ్చినట్లున్నాడు" అన్నాడు మళ్ళా మామూలుగా.

సుందరమ్మకు యెందుకో ఆదుర్దా యెక్కువయింది. చెప్పాలని కుతూహలం, చెప్పకపోతే యేమనుకొంటాడో, యెప్పటికైనా చెప్పాలిగదా! అనే బాధ అంతకంతకు యెక్కువవటం మొదలుపెట్టింది. "పెందలాడేమిటిలే! యిదివరకన్నా కాస్త ముందొచ్చాడు" అంది దీనంగా.

రఘునాథం భోజనం ముగించుకొని వసారాలోకి వచ్చాడు. రాగమయి కంచం కడిగేసి తలుపులన్నీ గట్టిగా గడియ వేసి సుందరమ్మతోపాటు వసారాలోకి వచ్చేసింది.

రఘునాథం అన్నం తిన్న తరువాత అటూ యిటూ పచార్లు చేసే అలవాటు చొప్పున తిరుగుతున్నాడు. సుందరమ్మ నారింజపండ్ల రసం తీసి కుటుంబరావుకిద్దామని వచ్చింది. తిరుగుతున్న రఘునాధానికి రెండుమూడుసార్లు బాగా వినిపించింది. సుందరమ్మ "అన్నయ్యా! అన్నయ్యా!" అని పిలిచింది. సుందరమ్మ వెంటనే పమిట చెంగు నోటికడ్డంగా పెట్టుకొని వెక్కి వెక్కి ఏడ్వటం రఘునాథం కొంతసేపటికి గాని వినిపించుకోలేదు.

"అత్తయ్యా!" అన్నాడు రఘునాథం

"అమ్మా! బావ పిలుస్తున్నాడే!" అంది రాగమయి దగ్గరగావచ్చి.

రఘునాథం లాంతరు కొంచెం పెద్దచేసి కుటుంబరావు మొగం మీద వెలుతురుపడేలాగు పుచ్చుకొన్నాడు. సుందరమ్మ బావురమనడంతో రఘునాధంకి, రాగమయికి కళ్లు చెమర్చినయి. కుటుంబరావు అత్మలోంచి నిర్జీవమైన నిట్టూర్పు వాయువు మాత్రమే వెలుపలికి వస్తోంది. రాగమయి వెళ్లి శ్యామసుందరిని లేపింది. విషయం అంతా తెలిసీ తెలియనట్లు చెప్పింది. శ్యామసుందరి చెరిగిపోయిన తలతో, నలిగిన చీరతో వసారాలోకి వచ్చి రఘునాథం వంకచూసి, అప్రయత్నంగా పమిట చెంగు కొస నోటికడ్డంగా పెట్టుకొంది. కాని పొర్లివచ్చే దుఃఖం ఆగటంలేదు.

ఉత్తరపైపు ప్రహరీ గోడ ప్రక్కన అరుగుమీద, మోకాలిమీద చేతులు పెట్టుకొని ఆకాశం వంక చూస్తూన్నాడు రఘునాథం. కుటుంబరావు మంచం రఘునాధం అరుగు దగ్గరకు చేర్చిన తరువాతే తానలా కూర్చుండిపోయాడు. సుందరమ్మ ఒక మూల గోడ కానుకొని కూర్చుంది. రాగమయి రఘునాథం కెదురుగా నిల్చుంది. శ్యామసుందరి తలుపుదగ్గర నిల్చుండలేక కూర్చొంది.

"నా దత్తత యేదుష్టనక్షత్రంలో జరిగిందో! అది మంచి నక్షత్రమని అపోహ పడ్డారంతా. తల్లిలేని కుటుంబంలోకి వచ్చిపడినందుకు, తండ్రిని చూసుకొని కొంత స్థిమితపడ్డాను. ఈ రోజుతో అది కాస్తా తీరిపోయింది. ఆస్తి వ్యవహారాలు చూడబోతే

అయోమయంగా వుంది. అత్తయ్య కుటుంబాన్ని చేరదీసానని లోకం అంతా కోడై రకరకాలుగా అనుకొంటూ కూస్తోంది. తల్లిలాగా చూస్తున్న అత్తయ్య కుటుంబాన్ని వేరుగా వుంచి, వాళ్ళకు కావలసిన సౌకర్యాలన్నీ కల్పిద్దామా! అనుకొంటే, నేను వండుకు తింటం చేతగాని వెధవనైతిని. యీడొచ్చిన పిల్లలకు పెళ్ళిళ్లు చేయవలసిన బాధ్యత అత్తయ్యకుంది. నా ఆస్తికి సర్వహక్కుదారున్ని నేనే! నాన్న చేసిన అప్పులెంతంత వున్నాయో నెమ్మదిమీదగాని తెలియవు. అంతవరకు నాకు అడకత్తెరలో వున్నట్లుగానే వుంటుంది. శ్యామసుందరి చదువూ రాగమయి చదువూ యెలాగో పూర్తయితే సుందరమ్మత్తయ్యకు అంత బాధనిపించదు. ఇదంతా జరగటం ఎట్లా?"

రఘునాథానికి యిలాంటివి ఆలోచించేటప్పటికి బుర్ర వేడెక్కింది.

ఆకాశం మీద పట్టిన దూది పింజల్లాంటి మబ్బులు గాలికి విడిలి పోయాయి. మినుకు మినుకుమంటూ మళ్ళా నక్షత్రమండలం కనిపించింది. యీ దృశ్యాన్ని చూస్తూవుండేటప్పటికి రఘునాథానికి కల్గిన ఆలోచనలూ — వాటికి సాక్షిభూతమైన దృశ్యాలున్నూ—

3

కుటుంబరావుకి చేయవలసిన దహన సంస్కారాలన్నీ సలక్షణంగా చేసాడు రఘునాథం. ఊళ్లో కుటుంబరావు చేసిన బాకీలు అన్నీ మొత్తం చూస్తే దాదాపు రెండువేలదాకా డేకింది. తన పేరవున్న భూమిలో అర్ధయెకరం అమ్మేసి, యెటువంటి తగాదాలు రాకుండా బాకీలు తీర్చేశాడు. కుటుంబరావు చేసిన అప్పులు తెలుసుకొని రఘునాథం బెదిరిపోతాడేమోనని సుందరమ్మ, రాగమయి, శ్యామసుందరి అనుకున్నారు. ఒక్క వీళ్ళేగాదు. వూళ్ళోవాళ్ళు కూడా అనుకోకుండా మానలేదు. అటువంటిదేమీ రఘునాథంలో కనిపించలేదు. సరిగదా! చాలా సంతోషించాడు. సుందరమ్మ యీ సంతోషానికి ఆశ్చర్యపడింది. "రఘూ! నాన్న యెంత అప్పు చేసాడో తెలిసిందిరా!" అని అడిగింది అప్పు తీర్చక ముందొకసారి.

"మొత్తమంతా రెండువేలదాకా!" అన్నాడు రఘునాథం.

"ఎంత తగలేశాడురా! చీట్ల పేకలో యీ వూరి పోకిరీ వెధవలంతా కలిసి, వాడికి ఆటనేర్పి, చివరకు తాగుడు కూడా అలవాటుచేసి, వాడి సొమ్మంతా తెగతిని, వాడి కొంపకే నిప్పంటించి ప్రాణాలు తీశారు." అని సుందరమ్మ వుక్రోషంతో అంటూంటే —రఘునాథం జీవంలేని చిరునవ్వునవ్వుతూ—"నాన్న యింతచేసి ఆస్తి పాడు చేసాడని నువ్వేమీ బాధపడకత్తయ్యా! అమ్మ పోయిన బాధతో ఆయనకు మనసు పూర్తిగా చెడిపోయింది. ఆయనేంచేస్తున్నాడో నాకు తెలియక పోలేదు. ఎట్లా చేసినా, ఆయనంటే నాకు పితృభక్తి వుంది కాబట్టి నేనే విధంగానూ ఆయన్ను గురించి విచారపడలేదు. చెడిపోయాడనేది మనం అనుకోకూడదు. సుఖంగా బ్రతుకుతామనేది అమ్మపోయిన తర్వాత కలగలేదు. యిక బ్రతికినంత కాలం ఆమెను తల్చుకొని యేడ్వాలి. ఏదో వ్యాసంగంలోకి దిగితే సగం ఆయావ పోతుందేమో! అని ఆయన తల్చుకొని వుండొచ్చు. చివరకు ఆ వ్యాసంగంలోని అవలక్షణాలన్నీ అలవాటయినయి. ప్రాణం మీదికి తెచ్చే అలవాట్లని ఆయనకు తెలియదంటావా! ఎవరికోసం యీ బ్రతుకును గడపటం? అని విరక్తిపడి వుంటాడు. నా వుద్దేశ్యంలో ఆయన యిలా చనిపోయి తీరతానని అనుకొని వుంటాడు. అందుకే అంతతప్ప తాగినప్పటికీ తనయిల్లు, తన సంసారం, అనేవి వున్నయ్యనీ, తనవాళ్ళొకరైనా వున్నారని, వాళ్లందరి దాపులో చద్దామని అనుకోబట్టే, తూలుతూ అయినా రక్తం కక్కుకుంటూ కూడావచ్చి సొంతయింటిముందు ప్రాణాలు విడిచాడు. తీరని బాధను అనుభవిస్తూ, తీసుకు చావడంకన్నా, ఆకస్మికంగా చావడం అదృష్టంకాదూ. ఎంత చెప్పినా! ఆయన ధన్యుడు. యీ చావే గనుక యే నడివీధిలోనో, యే మురుగు కాల్వలోనో అయితే లోకం అంతా యెంత నీచంగా

చెప్పుకొనేదో తెలుసా! ఆ విషయం వింటే మరీ ఎక్కువ బాధపడేవాళ్ళం." అంటూ రఘునాథం చెపుతూ ఉంటే సుందరమ్మకు కొంత మనశ్శాంతి కలిగినట్లనిపించింది.

శ్యామసుందరి "రఘునాథం ఒక వేదాంతి" అని భ్రమ పడింది.

రాగమయి "బావా!" అని మనసులో తీయగా పిలుచుకొంది.

యీ సంఘటనంతా యిలా జరిగింది, రఘునాథం అప్పులు తీరుస్తున్న రోజుల్లో

పరిస్థితులన్నీ చక్కబడ్డ తరువాత ఒకనాడు సుందరమ్మతో కొన్ని విషయాలు మాట్లాడాలని అనుకొన్నాడు రఘునాథం. కుటుంబరావు పోయిన తరువాత సుందరమ్మేగా ఆ యింట్లోకల్లా వయస్సులో పెద్ద.

ఆనాడు సుందరమ్మ ఒక్కతే యింట్లో వుంది. రాగమయి, శ్యామసుందరి బళ్ళోకి వెళ్లారు. రఘునాథం నెమ్మదిగా సుందరమ్మను కదలేస్తూ "అత్తయ్యా నీతో యీ సందర్భంలో ఒక విషయం ముచ్చటిద్దామని వుంది. నువ్వేమీ అనుకోనంటే ప్రస్తావిస్తా మరి!" అన్నాడు. సుందరమ్మ, రఘునాథం యేం చెప్పినా నచ్చితీరుతుందనే అభిప్రాయం గల్గివున్న మనిషి. అందువల్ల యేఅనుమానం, ఆదుర్దా లేకుండానే "ఫరవాలేదులే రఘూ! చెప్పు. యేమీ అనుకోన్లే." అంది.

"నా ఆస్తి-నా చదువుచూసి, నన్ను నువ్వు వలలో వేసుకొన్నావనీ, రాగమయినిచ్చి వివాహంఅనే పేరిట అంటగడదామని ప్రయత్నిస్తున్నట్లు, యీ వూళ్లో నేగాదు, మనచుట్టాల్లోకూడా చాలామంది అనుకొంటూండగా యిదివరలోనూ, యిప్పుడూ, చాలాసార్లు వింటూవస్తున్నాను. అది నిజం అని నేనెప్పుడూ నమ్మను. ఇదికూడా మనస్ఫూర్తిగా చెబుతున్నా-" ఇది యిలావుండగా——.

"రాగమయితో, నాకున్న పరిచయం, శ్యామసుందరితో వుండలేదని, రాగమయినే, నే నెక్కువగా చూసుకొంటున్నానని, నాకున్నదల్లా రాగమయేనని, శ్యామసుందరి వుత్త మందబుద్ధిగల మనిషితోజమని," మరొక రకమైన ప్రచారం ఒకటి మన చుట్టాల్లోనే బయలుదేరింది, యిది యెంతవరకు నిజమో! నీవే వూహించుకో! యీ విషయం యిలా కల్పించి నిన్ను మోసం చేద్దామని నాకెట్టి అభిప్రాయం లేదు సుమా! నా సంగతి నేనెలా మాట్లాడేది నువ్వెరుగంది కాదుగా! బుద్ధి తెలిసినప్పటినుంచి పెంచి పెద్ద చేసావు. వరుసకి అత్తయ్యవైనా, నిజంగా కన్నతల్లితో సమానమైన దానివి. నీ చేతికూడు తిని, నిన్ను యెలా మోసపుచ్చుతా! ఉన్న మాట చెపుతున్నా!" అన్నాడు రఘునాథం.

సుందరమ్మకు యేవిధంగా సమాధానం యివ్వాలో అర్థంకాలేదు.

"రఘూ! ఎవరో అనుకొంటున్నారని నే నేమీ అనుకోను. నువ్వు నన్ను మోసంచేసి, బాధిస్తావని నాకెప్పుడూ లేదు. ఒకవేళ రాగమయిని నువ్వు కావాలన్నా, రాగమయికి నువ్వు యిష్టపడినా, నే నెప్పుడూ యెట్టి పరిస్థితుల్లోనూ అభ్యంతర పెట్టను. శ్యామసుందరి విషయంలో మాత్రమే వెనుకంజ వేయాల్సొస్తుంది. పెళ్లికెదిగివుంది. యీ సంవత్సరంతో ఆ కాస్త చదువు పూర్తవుతుంది. దాన్ని గురించే అప్పుడప్పుడూ ఆదుర్దా కలుగుతూంటుంది. రాగమయి పుట్టినప్పుడే అనుకొన్నాం, నేనూ-మామయ్యానూ. నీ గురించి నాజీవితం, నాకుటుంబం యీ నాడుకి యిలా అవుతుందని, నువ్వాశ్రయమిచ్చి కాపాడుతావని కలలో కూడా అనుకున్నానా! యేదో జరిగిపోయింది. పదిసార్లు అనుకొంటేమాత్రం వచ్చేలాభం యేముంది?" సుందరమ్మ గొంతు బొంగురుపోయింది. యీ మాటలంటుంటే రఘునాథం అది గుర్తించాడు.

(సశేషము)